
గురజాలలో నామినేషన్ వేసేందుకు బయలుదేరే ముందు కాసు మహేష్ రెడ్డికి దిష్టి తీస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు


ప్రజలకు అభివాదం చేస్తున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి


కాసు మహేష్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు ఎదురుచూస్తున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు - గురజాల

క్లుప్తంగా

దాహార్తి తీర్చడం అభినందనీయం



రెంటచింతల: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎండలకు పేరు పొందిన రెంటచింతలలో ప్రయాణికులకు, పాదచారులకు దాహార్తిని తీర్చేందుకు ఎస్‌టీయూ యూనియన్ ఉపాధ్యాయులు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని యూనియన్ బ్యాంక్ మేనేజర్ విశాల్ ఉప్రే, స్టేట్‌బ్యాంక్ మేనేజర్ పున్నయ్య అన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ సెంటర్లో ఎస్‌టీయూ ఏపి రెంటచింతల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వేసవికాలం అంతా కొనసాగేలా ప్రయాణికులకు, గ్రామస్తులకు చల్లటి మంచి నీటిని పంపిణీ చేసేలా చర్యలు చేపట్టడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టీయూ ఏపి రెంటచింతల శాఖ అధ్యక్షులు ఎం. బేబీరాణి, ప్రధాన కార్యదర్శి షేక్ ఖుద్దూస్, ఆర్థిక కార్యదర్శి ఎం. వెంకటేష్, సంఘం నాయకులు లేళ్ల శ్రీనివాసరావు, నాగేశ్వరావు, కె. చంద్రం, జి. చంద్రశేఖర్, ప్రసాద్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ



పిడుగురాళ్ల: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు చేపట్టినట్లు పట్టణ ఎస్ఐ అమీర్ తెలిపారు. పట్టణంలోని బైపాస్ రోడ్డు వద్ద బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్ఐ అమీర్ మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో వాహనాలను ప్రభుత్వ నిషేధిత మద్యం, అక్రమ నగదుతో పాటు ఇతర వస్తుల రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. అందులో భాగంగానే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే అటువంటివారిపై పోలీస్ శాఖ చర్యలు చేపడుతుందని తెలిపారు. ఈ తనిఖీల్లో ఎస్ఐతోపాటు పోలీస్ సిబ్బంది దాసు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మీచెన్నకేశవ స్వామి కళ్యాణ మహోత్సవం



మాచర్ల : పల్నాటి ప్రజల ఇలవేల్పు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి కళ్యాణ మహోత్సవం మంగళవారం అర్ధరాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 21 నుంచి ప్రతి రోజూ ఈఓ సాంబయ్య, అర్చకుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రతి రోజూ స్వామి వారిని వివిధ వాహనాలపై ఊరేగిస్తున్నారు. ఈ నెల 28న రథోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రథోత్సవాన్ని తిలకించేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు హాజరై స్వామి వారిని తిలకిస్తారు. ప్రతి ఏటా జరిగే ఈ బ్రహ్మోత్సవాలకు భక్తులు ఏటేటా పెరుగుతున్నారు.

గంగమ్మ తల్లి దేవాలయంలో పూజలు



పిడుగురాళ్ల : గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా బుధవారం పట్టణంలోని గంగమ్మ తల్లి దేవాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నామినేషన్ పత్రాలను గంగమ్మ తల్లి దేవాలయంలో పూర్తి చేశారు. అనంతరం ముహర్త సమయానికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

హోరెత్తిన నామినేషన్ ర్యాలీ

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమానికి పిడుగురాళ్ల పట్టణానికి భారీ ర్యాలీలో బయలుదేరారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి గంగమ్మ తల్లి దేవాలయంలో పూజలు నిర్వహించి నామినేషన్ పత్రాలతో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ర్యాలీ బయలుదేరింది. పిడుగురాళ్ల పట్టణంతోపాటు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమానులు భారీ సంఖ్యలో చేరుకుని ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే కాన్వాయి, బైక్, ట్రాక్టర్ ర్యాలీ పిడుగురాళ్ల నుంచి గురజాల పట్టణంలోని ఆర్‌డీవో కార్యాలయం వరకు భారీ ర్యాలీతో వేల సంఖ్యలో అభిమానులు హాజరయ్యారు.

గంగవరంలో ప్రగతి పరుగులు


మోతాదు వారి బజారులో ఏళ్లనాటి సమస్యకు సిమెంటు రోడ్డుతో మోక్షం


కరణం వారి బజారులో నూతనంగా నిర్మించిన రహదారి


కేజీబీవీ పాఠశాల సమీపంలో నూతనంగా నిర్మించిన రహదారి

- చిన్న గ్రామం...అభివృద్ధి మెండు
- నవరత్నాల ద్వారా రూ. 22.13 కోట్లు పంపిణీ


గంగవరం గ్రామంలో నిర్మిస్తున్న హెల్త్ క్లినిక్

గురజాల : మండల పరిధిలోని గంగవరం గ్రామంలో ప్రగతి పరుగులు తీసింది. గత పాలకులు ఆ గ్రామంలో కనీసం ఒక్క సిమెంటు రోడ్డు వేసిన దాఖలాలు కనిపించలేదు. కానీ నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గ్రామంలో అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. దీంతో చిన్న గ్రామం అయినా అభివృద్ధి మాత్రం మెండుగా జరిగింది. గడపగడపకు మన ప్రభుత్వంలో ప్రతి ఇంటికీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన సదుపాయాలతో పాటు పాఠశాలలు, వైద్య శాలలు, రోడ్డు, రహదారులు, వంటి ఎన్నో రకాల సౌకర్యాలు చేకూరాయి. గ్రామం అంతా ఎటు చూసినా సిమెంటు రోడ్లు, డ్రెయిన్లతో దర్శనమిస్తున్నాయి. కోట్లాది రూపాయలతో ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అనేక అభివృద్ధి పనులు గ్రామ మౌలిక స్వరూపాన్ని మార్చాయి. మొత్తం గ్రామ రూపం తక్కువ కాలంలో మారిపోవడంతోల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో అభివృద్ధి పనులు

- నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో 9 పనులకు గాను 24.2 లక్షలు
- 1 సచివాలయ భవనాల నిర్మాణం కొరకు రూ.40 లక్షలు. పనులు ప్రారంభం కాలేదు
- 1 రైతు భరోసా కేంద్రాల నిర్మాణం కొరకు రూ.21.80 లక్షలు శ్లాబు లెవల్ పనులు పూర్తి
- 1 విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాల నిర్మాణం కొరకు రూ.20.80 లక్షలు శ్లాబ్ లెవలు
- 7 ప్రాంతాల్లో సిసి రోడ్లు నిర్మాణం కొరకు రూ. 37 లక్షలు మరో అదనంగా రూ.20లక్షలుతో ఏర్పాటు
- 7 గ్రావెల్ రహదారుల కింద రూ.12 లక్షలు
- జల్‌జీవన్ మిషన్ కింద ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి ఏర్పాటు చేసి నీటిని అందించేందుకు రూ.1 కోటి 79 లక్షల 40వేల నిధులు సమకూర్చారు.
- 1 ప్రభుత్వ భవనాల నిర్మాణం కొరకు రూ. 8 లక్షలు

గ్రామంలో సంక్షేమం ఇలా :

- 433 మందికి అమ్మ ఒడి కి గాను 1.98 కోట్లు
- 254 మందికి జగనన్న విద్యాదీవెనకు గాను రూ.92.26 లక్షలు
- 193 మందికి జగనన్న వసతి దీవెనకు గాను రూ. 31.43 లక్షలు
- 703 మందికి రైతు భరోసా ద్వారా రూ. 3.40 కోట్లు
- 347 మందికి క్రాపు ఇన్సురెన్సు కింద రూ.15.11 లక్షలు
- 114 మందికి సున్నావడ్డీ పంట రుణాలు రూ.4.43 లక్షలు
- 674 వైఎస్సార్ పెన్షన్ కానుక కింద రూ. 6.36 కోట్లు
- 140 మందికి వైఎస్సార్ చేయూత కింద రూ 60 లక్షలు
- 173 మందికి ఇంటి నివేశన స్థలాలు మంజూరు


గంగవరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న రైతు భరోసా కేంద్రం

గ్రామంలో అభివృద్ధి పరుగులు



వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామంలో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరిగాయి. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందాయి. దీంతో ప్రతి ఒక్కరూ ఆనందంగా ఉన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చి పాలనను ప్రజలకు దగ్గర చేశారు. కోట్ల నిధులతో గ్రామం అభివృద్ధి పరుగులు తీసింది.

– బొందలపాటి బ్రహ్మేశ్వరరావు, గంగవరం

ఏళ్ల నాటి సమస్యకు మోక్షం



ఎన్నో ఏళ్లనాటి సమస్యలకు మోక్షం కలిగింది. గతంలో ఎవరూ కూడా ఇంటి వద్దకు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరించిన దాఖలాలు లేవు. కానీ సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మాత్రం ఎమ్మెల్యేలు అంతా ప్రజలతో మమేకమై ఉన్నారు. ఇంటి వద్దకు వచ్చి ఏ సమస్య ఉందని అడిగి తెలుసుకుని మరీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సమస్య పరిష్కరించారు.

– షేక్ పీర్ అహ్మద్, గంగవరం

ప్రతి ఇంటికి సంక్షేమం



వైఎస్సార్ సీపీ పాలన బాగుంది .ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించడం వలంటీర్ వ్యవస్థను తీసుకురావడం, సచివాలయాలు ఏర్పాటుచేసి ఊరిలోనే పాలన అందించడం బాగుంది. వృద్ధులు, వికలాంగులు అందరూ ఆనందంగా ఉన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం అందింది. పార్టీలకుచ కులమతాలకతీతంగా పథకాలు అందించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు సమపాళ్లల్లో అందిస్తున్నారు.

– పేరుపోగు రోశయ్య, గంగవరం

జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యం

మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తల్లి రాములమ్మ


ఎన్నికల ప్రచారం చేస్తున్న రాములమ్మ

రెంటచింతల : సీఎం జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యమని ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తల్లి రాములమ్మ, చెల్లెలు జె. నాగమణి అన్నారు. బుధవారం రెంటచింతలలోని పలు కాలనీల్లో వారు మాచర్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, నర్సరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పి. అనిల్‌కుమార్ యాదవ్‌ను గెలిపించాలని ఎన్నికల ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాముల సంపూర్ణమ్మ, జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు పూజల రామయ్య, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, మండల ఎన్నికల ఇన్‌చార్జి జువ్వాజి సాంబిరెడ్డి, మాజీ సర్పంచ్ అల్లం ప్రతాప్‌రెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి డేగల మహేష్, పార్టీ నేతలు తుమ్మా ఇన్నారెడ్డి, పేర్ల ముత్తయ్య, ఏరువ విజయ భాస్కర్ రెడ్డి, కొమ్మారెడ్డి మర్రెడ్డి, దేవిరెడ్డి నారపరెడ్డి, దొండేటి వెంకటేశ్వరరెడ్డి, సుధాకర్‌రెడ్డి బాపనపల్లి శ్రీనివాసరావు, ఉమ్మా రామాంజనేయ రెడ్డి, గుజ్జుల సైదారెడ్డి, ఏలూరి సత్యం, బంకూరి తిరుపతిరావు, గుండా కిశోర్, బొల్లెద్దు ఇన్నయ్య, డేగల సంసోన్, కాయితి వెంకట రెడ్డి, ఆరికట్ల బ్రహ్మారెడ్డి, ఇగుటూరి మల్లారెడ్డి పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుపొందాలని ప్రత్యేక పూజలు


ప్రత్యేక పూజల్లో మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి, ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి బుధవారం నామినేషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని పిడుగురాళ్ల పట్టణంలోని దేవాలయాల్లో, చర్చిలాల్లో, మసీదులో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు, దువా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో ఉన్న వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్లోని క్రీస్తు లూథరన్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న తెలుగు బాప్టిస్ట్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మర్కస్ మసీదు (పెద్ద మసీదు) ముస్లిం సోదరుల ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్, దువ్వా కార్యక్రమాన్ని నిర్వహించారు. నామినేషన్ ప్రక్రియ విజయవంతం కావాలని, మే 13న జరగనున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా కాసు మహేష్‌రెడ్డి గెలుపొందాలని ఆకాంక్షించారు. నర్సరావుపేట ఎంపీగా పోటీచేయిన అనిల్‌కుమార్ యాదవ్, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపొందాలని, మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నెలకొల్పాలని ఈ కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డితోపాటు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయ సమీపంలోని గల శ్రీ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి కాసు వెంకట కృష్ణారెడ్డి, గురజాల నియోజకవర్గ శాసన సభ్యులు కాసు మహేష్‌రెడ్డిలు పాల్గొన్నారు. కాసు మహేష్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమాన్ని పురస్కరించుకుని కాసు మహేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరికి ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. గురజాలలో కాసు మహేష్‌రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేగా అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని పూజలు నిర్వహించారు.

వైఎస్సార్ సీపీ ప్రత్యామ్నాయ అభ్యర్థిగా పీవీఆర్ నామినేషన్



మాచర్ల రూరల్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రత్యామ్నాయ మాచర్ల ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్‌కు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి మరుమాముల శ్రీనివాసశర్మ, పిన్నెల్లి గౌతమ్‌రెడ్డి ఉన్నారు. వీరితో పాటు మరో 8 మంది నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో జి శ్రీనివాసరావు, విఆర్‌ఎస్ సత్యనారాయణచారి, జూలకంటి శోభారాణి, గోపాలుని శ్రీనివాసరావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, షేక్ మాబుజాని, బొల్లా శ్రీనివాసరావు, డేగల సైదరాజు ఉన్నారు.

నామినేషన్ రోజునే విజయోత్సవ ర్యాలీ


ఎమ్మెల్యేకి స్వాగతం పలికేందుకు ఎదురు చూస్తున్న కరాలపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు

పిడుగురాళ్ల రూరల్: గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నామినేషన్ కార్యక్రమం బుధవారం విజయోత్సవ ర్యాలీగా సాగింది. నామినేషన్ వేయడానికి వెళుతున్న మహేష్‌రెడ్డి ర్యాలీకి గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మండలంలోని కరాలపాడు గ్రామం నుంచి 70 ట్రాక్టర్లలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బైక్ ర్యాలీలతో స్వచ్ఛందంగా తరలి వచ్చారు. తుమ్మలచెరువు గ్రామం వద్ద బైక్ ర్యాలీతో టోల్‌ప్లాజా వద్ద ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి స్వాగతం పలికారు. కామేపల్లి, బ్రాహ్మణపల్లి, పెద అగ్రహారం, చెన్నాయిపాలెం, కోనంకి, పాత గణేశునిపాడు, గుత్తికొండ, జూలకల్లు తదితర గ్రామాల నుంచి కార్యకర్తలు తరలి వచ్చారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహిద్దాం

నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్


పోలీసు అధికారులతో మాట్లాడుతున్న ఆర్ఓ ఎ శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్: సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో ప్రధాన పార్టీల అభ్యర్థుల నామినేషన్ ప్రక్రియ, ర్యాలీలు ముగిసిన వెంటనే గ్రామాల్లో శాంతిభద్రతల పర్యవేక్షణలో పోలీసు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజక వర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. శ్యాం ప్రసాద్ కోరారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో గురజాల డీఎస్పి పల్లపురాజు, సిఐలు శరత్‌బాబు, సురేష్‌తో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 299 పోలింగ్ కేంద్రాల్లో 150కి పైగా సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, ఈ కేంద్రాల్లో ఎప్పటికప్పుడు శాంతిభద్రతలను పర్యవేక్షిస్తూ, ముఖ్యంగా నిఘా వ్యవస్థను పటిష్టపరుస్తూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా చొరవ చూపాలన్నారు. ఓటరు ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా ఓటు హక్కును వినియోగించుకునేందుకు మనందరం సమిష్టిగా పనిచేద్దామని కోరారు. శాంతిభద్రతల పర్యవేక్షణలో భాగంగా కేంద్ర అదనపు బలగాలు నియోజక వర్గానికి రానున్నట్లు చెప్పారు. సమావేశంలో తహశీల్దార్ మంజునాధ రెడ్డి, డిప్యూటీ తహశీల్దార్ షేక్ బాషా, ఫణీంద్ర, శర్మ, ఆర్ఐలు, ఎస్ శ్రీనివాసరావు ఉన్నారు.

కాసు నామినేషన్‌కు భారీగా తరలివెళ్లిన నేతలు


దాచేపల్లి నుంచి భారీ ర్యాలీగా తరలి వెళుతున్న నేతలు

దాచేపల్లి : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గురజాల అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నామినేషన్‌కు భారీగా తరలివెళ్లారు. దాచేపల్లి నగర పంచాయతీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు బుధవారం గురజాల వెళ్లారు. యువకులు ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. నడికుడిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డికి మహిళలు హారతి ఇచ్చి నుదుట తిలకం దిద్ది ఆశీర్వాదించారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ కన్వీనర్లు కోట కృష్ణ, షేక్ సుభానీ, నగర పంచాయతీ చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కొప్పుల సాంబయ్య, పట్టణ మాజీ కన్వీనర్ మునగా పున్నారావు, జెడ్పీటీసీ మూలగొండ్ల కృష్ణకుమారి, ఎంపీపీ కటకం జయశ్రీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, సొసైటి అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, మాజీ సర్పంచ్‌లు మందపాటి రమేష్‌రెడ్డి, బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, వైస్ చైర్మన్లు షేక్ మస్తాన్‌బీ, కొమెర బత్తిన అన్నపూర్ణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మార్కెట్‌యార్డు డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

డబ్బులిస్తాం...ర్యాలీకి రండి

టీడీపీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి నామినేషన్ కోసం నేతల కష్టాలు


పట్టణంలో నగదు పంపిణీ చేస్తున్న దృశ్యం

మాచర్ల : సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా అసెంబ్లీ మాచర్ల నియోజక వర్గానికి అభ్యర్థిగా టీడీపీ తరఫున పోటీ చేస్తున్న జూలకంటి బ్రహ్మారెడ్డి నామినేషన్ సందర్భంగా ప్రజలను డబ్బులు ఇచ్చి నామినేషన్‌కు తీసుకువచ్చారు. బుధవారం నామినేషన్ దాఖలు చేసేందుకు సాగర్ రోడ్డులోని, శ్రీశైలం రోడ్డు నుంచి ముందుగా ర్యాలీ పెట్టారు. ఈ ర్యాలీకి పార్టీ తరఫున క్యాడర్, కార్యకర్తలు కేవలం వందల సంఖ్యలో హాజరవుతారన్న ఆందోళనతో మంగళవారం ఉదయం నుంచే ర్యాలీకి వేలాది మందిని తరలించేందుకు ప్రలోభాలు పెట్టారు.పట్టణంలోని మహిళలకు మనిషికి రూ. 300ల, పురుషులకు రూ. 500ల చొప్పున ర్యాలీ అనంతరం టోకెన్ ఇచ్చి డబ్బులు తీసుకునే పద్ధతి పెట్టారు. ప్రతి ఇంటికి వెళ్ళి ఆయా వార్డు టీడీపీ నాయకులు మేం డబ్బులు ఇస్తాం, మీరు ర్యాలీకి రండి, మూడు గంటలు ఉండండి. డబ్బులు తీసుకోండి. అన్నం తినండని విస్తృతంగా ప్రచారం చేశారు. మూడు రోజుల క్రితం వైఎస్సార్‌సీపీ తరఫున అసెంబ్లీ అభ్యర్థిగా పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వేలాది మందితో ప్రదర్శన నిర్వహించి నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో తమకు అదే స్థాయిలో జనం రాకపోతే కష్టమని భావించిన టీడీపీ ఎక్కువగా మహిళల పై దృష్టి సారించింది. వేసవి కాలం పనులు లేకపోవడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి భారీ స్థాయిలో మహిళలు నగదు ఆశతో తరలివచ్చారు. భోజనాలు తిన్న తరువాత ఎక్కడికక్కడ టోకెన్‌లు తీసుకుని ఇన్‌ఛార్జిలకు నగదు అప్పజెప్పారు. ఓటు లేని మైనర్లు సైతం తమ పేర్లను నమోదు చేయించుకుని ర్యాలీకి వచ్చి నగదు తీసుకు వెళ్ళారు. గ్రామీణ ప్రాంతాలకు వాహనాలు, మద్యం, నగదును ముందుగానే పంపిణీ చేశారు. ఈ నామినేషన్ ప్రక్రియకు మొత్తం భారీ స్థాయిలో ఖర్చు పెట్టడానికి ముందుకొచ్చిన వ్యక్తి తెరవెనుక ఉండి మొత్తం నియోజక వర్గ నాయకులతోనే కథ నడిపారు. మొత్తంగా డబ్బులిచ్చి ర్యాలీకి పిలుచుకువచ్చి జే జేలు పలిపించుకొని సభ సక్సెస్ అని వారితోనే ప్రకటించుకున్నారు. ప్రతిపక్షంలో ఉండి పదేళ్ళు పార్టీ క్యాడర్‌ను పట్టించుకోకపోవడం వల్ల ఎక్కడికక్కడ అసంతృప్తి ఉండటంతో కార్యకర్తలను పోగుచేయడానికి వెనుకంజ వేశారు. ప్రలోభాలకు తెరతీసి, మొత్తానికి నామినేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా అబ్బో డబ్బులిచ్చారు. మందు ఇచ్చారు. సభ సక్సెస్ అంటున్నారు. మరి ఓట్లు పడతాయో, లేదో వేచి చూడాలి. ఇప్పుడే ఇంత ఖర్చు చేస్తే మరి ఓట్లకు ఎత ఖర్చు పెడతారోనని, మనకి పండగే అంటూ పలువురు ప్రజలు చర్చించుకుంటున్నారు.

మండుటెండలో ప్రజలకు అవస్థలు

మాచర్ల : నియోజకవర్గ ప్రధానకేంద్రమైన మాచర్ల పట్టణంలో బుధవారం టీడీపీ తరఫున నామినేషన్ సందర్భంగా మందుబాబులు, మైనర్లు ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు తీసి నానా హంగామా చేశారు. గంటల కొద్దీ ట్రాఫిక్ నిలిపిపోయేలా వీరు హల్‌చల్ చేయటంతో అటు గుంటూరు రోడ్డు, ఇటు సాగర్, శ్రీశైలం రోడ్డులో పూర్తి మండుటెండలో మూడు గంటలకు పైగా ప్రజలు నానా తంటాలు పడ్డారు. వాహనదారులు పక్కకు వెళ్ళమని చెబుదామంటే ఎవరు ఎప్పుడు మీదపడతారన్న భయంతో ప్రజలు ఏమీ అనలేక మిన్నకుండిపోయారు. టీడిపి జెండాలు తప్ప, అంతో ఇంతో నామమాత్రంగా జనసేన జెండాలుండగా బిజెపి ఉనికి నామమాత్రంగా కూడా కనపడలేదు. పేరుకే కూటమి అభ్యర్థి అయినా చివరికి తెలుగుదేశం పార్టీ నాయకుల హవా తప్ప మిగతా వారికి ప్రాధాన్యత లేకుండా పోయింది. మండుటెండలో ప్రజలు ర్యాలీలో పాల్గొనగా మీరెలా ఉంటే నాకేంటి అంటూ నాయకులు ప్రచార రథానికి డేరా ఏర్పాటు చేసుకుని నీడపట్టున ర్యాలీలో మాట్లాడారు. మరో వైపు ప్రజలు ఎండకు అల్లాడిపోతుంటే అబ్బో నాయకులకు నీడ కావాలి. మనం మాత్రం ఎండలో నడవాలి. మనకు రూ. 300, రూ. 500లు ఎండతంటాలు తెచ్చాయని గుసగుసలాడుతూ వెనుదిరిగారు.